

పా. వి. రాఘవరావు గారు (సారస్వతమిత్రమండలి)

'ఓరి అయ్యల్లో! అన్నివియ్యము ముష్టి వారి యెదానఁబోసి నాకూటిలో మట్టిఁ గొట్టఁ దలఁచినారఁట రోయి! నాధనము రాళ్లపాలుచేయనెంచినారఁట రోయి! నాసంసారము సారహీనమౌనహారాయెడారి చేయ నూహించినారఁట రోయి! ఇదియేమి కర్మము. అత్తయ్యా! నీమొగముమండ! పాలగదిలో పిల్లి లాగున నాయింటి కెట్లు దాపురించినావే! ఓ కన్యకాపరమేశ్వరీ! తల్లీ! ఈ శనిదేవతల నీ నోటవేసికొని పోయితివేని నీ కీసంవత్సరము అరణాఅరఁటిపళ్లు, కుంకుమ, అర్పించుకొనియెదను. అమ్మా! రక్షించు! ఈయింటిలోని ముండలందఱు సెనగపప్పువలె నాధనమంతయుఁ దిని వైచుచున్నారు.' అని వెంకటసెట్టి నోటికివచ్చినట్లఱచుచు, వీథిగుమ్మముపైఁ జదికిలఁబడెను.

వెంకటసెట్టి ఆయూరిలోనున్నవారందఱలో మిక్కిలి ధనవంతుఁడని పేరుఁ బడసినాఁడు. లక్షలకొలఁదిరూకలాతనికొట్లలోఁ బడి మూల్గుచుండెను. అందు దమ్మిడీయైన ఖర్చుచేయఁడు. కర్మముచాలక ఖర్చుచేసినా తిరిగి ఆదమ్మిడీకొట్టులోఁ బడవైచువఱ కాతని హృదయమం దిసుమంతయేనియుశాంతి యుండదు. కాన ఆయూరివారంద ఱాతనికి 'దమ్మిడీసెట్టి' యని పేరిడిరి.

ఛీ! ధనము కలవాని కెంతలోభత్వమో! తనధనము వెచ్చపెట్టుదురేమో యను దిగులుచేఁ దనయాప్తుల నెగురవేసికొని పొమ్మని కన్యకాపరమేశ్వరికి మ్రొక్కులిడుచున్నాఁడే. ధనము సంపాదించుటకై తగనిప్రయత్నము లొనర్చుచున్నాఁడే; కాళులఁ బట్టుకొనుచున్నాఁడే; కోర్టులెక్కుచున్నాఁడే; ప్రమాణములఁ జేయుచున్నాఁడే; ప్లీడర్ల కాశఁబెట్టుచున్నాఁడే; వ్యాజ్యము గెల్చినపిదప వారికి తొంటచేయిఁజూపుచున్నాఁడే; వారియుసురుఁ దినుచున్నాఁడే. సంపాదించినధనము దాఁచు నిమిత్తమై తహతహలాడుచున్నాఁడే; నిద్రాహారము లెఱుఁగక భక్తునివలె నినుపపెట్టెకడ భజన లొనర్చుచున్నాఁడే. కాంపౌండువడ్డీల కప్పులిచ్చుచున్నాఁడే. తప్పుపత్రముల సృష్టించుచున్నాఁడే. ఋణముఁ దీసికొనినయాతఁడు 'దివాలా' తీయఁగ 'బారు'మని యొక్కయే డ్వేడ్చుచున్నాఁడే. నలువురచేఁ దిట్లు తినుచున్నాఁడే. తిట్లుదీవన లగుచున్నవి. పాపిచిరాయు వగుచున్నాఁడు.

* * * *

వీథిలోనుండి పరుగెత్తుకొనివచ్చుచు వెంకట సెట్టితో నతని కుమారుఁడు, 'అయ్యా! అయ్యా! బడిలోని మా పంతులే అయ్యా! ఉఁ ఒక్కటోపీ కొనమన్నాఁ డయ్యా! అదితలపై లేనిదే బడిలోనికి రానియ్యడఁటఅయ్యా! నా కొకటోపీ కొనవూ' అనెను. అంత సెట్టి, 'ఓరీ! వెఱ్ఱిమొగమా! మనకా కిరస్తాని' వేషాలెందుకయ్యా! కోమటికి టోపీయెందుకయ్యా! ఆపంతులు పాపయ్యశాస్త్రియేనా! కానిమ్ము. దొంగముండకొడుకు. తేపు విఘ్నేశ్వరునిచవితికి మీచే పూజచేయించి దక్షిణ అడిగినప్పుడు వానిపని పట్టించెదను. అత్తయ్య పాలకాయలు చేసినది పోయితిను; లేకపోయిన మిగులవు.' అని కొమరుని మెల్లగా లోని కంపెను.

మఱొక నిముసమునకు సెట్టి నేవకుఁడొకఁడు ఒక ఉత్తరముఁ దీసికొనివచ్చి సెట్టి చేత నిడిపోయెను. ఆయుత్తరము సెట్టి ఇట్లు చదువుకొనెను:—

'వెంకటసెట్టిగారికి—

మీ ఇనుపపెట్టె నీరాత్రి దొంగిలింపఁదలఁచుకొంటిని. జాగ్రత్త. పాడుధనము పోయినఁ బోవునుగాని ప్రాణముఁగాచికొనుఁడు.

భవదీయమిత్రుఁడు:
"గజదొంగ."

ఇక మనసెట్టిని వర్ణింపనలవి కాదు. సరస్వతీదేవి 'అలవైకుంఠపురంబులో' అను పద్యముప్రాసి వైకుంఠవర్ణనఁ జేసెనుగాని, మనసెట్టి ప్రస్తుతపుస్థితి వర్ణింపఁ గలదో లేదో చెప్పలేము. సెట్టి కరగడియవఱకును నోట మాట లేదు. "ఓధనదేవతా! ఇంకేమున్నది. నమస్కారము. పోయెదవా? ఎంతకాలమునుండి నిన్నుఁ బూజఁ జేయుచుంటిని. భక్తునిపైఁ గరుణ లేదా? నిన్ను నిత్యము సంస్తుతిఁ జేయుటకై దుర్గయ్యచేతిలోఁ బదివరాలు పోసి, పద్యములను, దండకములను వ్రాయించితినే. దయ లేదా? పోయెదవా? అయ్యో!" అని వెక్కి వెక్కి యేడువ మొదలిడెను.

అంత సెట్టితండ్రియగు పద్దయ్య అటకు వచ్చి, 'వెఱ్ఱిమొగమా, వెక్కి వెక్కి యేడ్చుచుంటి వేమయ్యా' అనెను. అంత సెట్టి, "అయ్యా! ఊరకే యేడ్చుటకు నేను నాటకములలో వేసములు వేయువాఁడ నా? ఈ యూరివారి దృష్టి దోషము నాకు తగిలినది. సెట్టి యింటిలో నిలువెత్తు ఇనుపపెట్టెయున్నదని జనులందఱువారిపుట్టిమునిఁగిపోయినట్లేడ్చుచున్నారు.' అనిఅనెను. పద్దయ్య, ఏమిటయ్యా! వెఱ్ఱిచదువు. కారణము లేకుండనట్లు కన్నీరు కార్చుచుంటివేమి?' అనెను' కారణము కాగితములో నున్నది చూడు' మనిగజదొంగ వ్రాసినయుత్తరము వెంకటసెట్టి పద్దయ్య చేత నిడెను. పద్దయ్య ఉత్తరముఁజదివిచూచుకొని, 'వెఱ్ఱిమొగమా! ఆలస్యము చేయక రఘునాథరావుగారింటికిఁ బో'మ్మని చెప్పి, తాను లోనికిఁ బోయెను.

సెట్టి పైనుత్తరీయము వైచుకొని రఘునాథరావుగారిఇంటికిఁబరుగెత్తెను. ప్రపంచమున జనులకందఱకును అసామాన్యమగు వస్తువులఁ జూచుటయందుఁ గాని, చేష్టలఁ దిలకించుటయందుఁగాని, సంగతుల వినుటయందుఁ గాని

కుతూహల మెక్కువ. సంతలోనికి నాల్గు చెవులగేదె వచ్చినదనఁగానె, చేయు పనుల నన్నిటివిడిచి, గడపదాఁటియెఱుఁగని కాంతామణులు సహితము పరుగెత్తెదరు. ఎన్నఁడును ఆంధ్రపత్రికఁ జూచినపాపమునకుఁబోని నిగర్వ చూడామణి నక్కకు కుక్కపిల్లలు పుట్టినవని సంగతి వినఁగానె క్లబ్బునకుఁ బయనమగును. స్థూలకాయులఁ జూచిన నరుల కుత్సాహము మెండు. ఆతఁడు నడువఁగఁ జూచిన మఱింత యుత్సాహము. అట్టియెడ వర్ణింప నలవికాని వగసెట్టి పరుగెత్తుసమయమందు జనుల యానందము అపారము; అవర్ణనీయము. ఎందులకో ఆఆనందము వారికే తెలియదు.

* * * *

౨

సుప్రసిద్ధాపరాధపరిశోధకు లగు రఘునాథరావుగారు తమ గదిలోఁ గూరుచుండి తమ కెదురుగఁ గూరుచున్న తమశిష్యు లగు జయదేవుగారితో నిట్లు మాటలాడుచుండిరి:

రఘు—జయదేవు! నేను ముసలివాఁడనైతిని. దేహదార్ఢ్యము తగ్గుచున్నది. ఇఁక నే నీపాట్లు పడఁజాలను. నీ వీకార్యముల నిఁక మీఁద నెఱవేర్చుచుండవలెను.

జయ—ఈ detective పనికి life మీఁది ఆశల వదలిపెట్టవలయును. Life must be left to itself as 'unsavoury snuff'. సంసార మందున్నయాతఁ డట్లాచరించుట కష్టము. మాబోఁటి bachelors మాత్రమే ఈ పనికిఁ బనికి వచ్చెదరు. మఱియు enterprising spirit లేని వారీపని కక్కరకురారు. Generally enterprising spirit exists in bachelors. కాన మనమెటు చూచినను bachelors మాత్రమే ఈ యుద్యోగమునకుం బనికివచ్చెదరు. ప్రస్తుతము నేను bachelor నే కదా. ఇఁక వివాహముఁ జేసికొనఁదలఁచుకొనలేదు. Single blessedness, double wrechedness అని నా అభిప్రాయము. విధివశమునఁ బెండ్లిచేసికొనిన మాత్ర మీమాయతోలుబొమ్మ లెంతకాలము బ్రదుకును. Mors omnibus communis. కాన నేను ముదముతో నాపై నిడినభారము మోయ సంసిద్ధుఁడను.

రఘు—నీన్యాయవాద వృత్తియిఁదెంత మాత్ర మక్కరకు రాదుసుమా!

జయ—అయ్యా! నే నెఱుఁగనా? Suggestio falsi, Suppressio veri' అనెడు motto ఎప్పుడుపయోగపఱుపను. మఱియు నా intellectual capacity నేను చెప్పుకొనినయెడలఁబాలహీనముగా నుండును. Exaggeration అని నల్గురు నన్ను దూషింతురు. ఈ కాలపుజనులలోనున్న కర్మమే యిది. They cannot discover a true hero. నిజముగ Arsene Lupin అను నాతఁ డున్నయెడల నిముషములో నాతని చేతి కరదండములఁ దగిల్చి పాదాక్రాంతునిఁగఁ జేయగల్గు మేధావంతుఁడను. తా మెఱుఁగని దేమున్నది?

రఘు—సరియె లెమ్ము నీశక్తిఁ ద్వరలోఁ జూపింతువు గాక!

అంత రోఁజుకొనుచుమన సెట్టి రఘునాథ రావుగారి యింటఁ బ్రవేశించెను.

జయ—A living specimen of Shylock.

రఘు—ఏమోయీ! సెట్టీ! అంతత్వరగా నరుదెంచుటకుఁ గారణమేమి?

సెట్టి—బాబూ! తొందరగా వచ్చినను రెండుఘంటలు తీసికొనినది.

రఘు—జట్కాబండిపై రాలేదా?

సెట్టి—(లోన) ఓరయ్యో జట్కాబండియే. (పైకి) బాబూ! నడచినగాని శరీరము గట్టిపడదని వైద్యుఁ డనుటచే నడచివచ్చితిని.

రఘు—(లోన) అమ్మ దొంగముండకొడుకా! ఎంతయుక్తిగా మాటలాడితివి. (పైకి) నీవు వచ్చినపని యేమి?

సెట్టి—బాబూ! గొప్పవారిని జూచుటకుఁ బని యేముండును?

రఘు— అటులైనఁ జూచితివి కాన పొమ్ము.

సెట్టి—చిత్తము. బాబూ! చిన్న మనవి కలదు. చిత్తగించవలయును.

రఘు—త్వరగఁ దెమల్చుము.

సెట్టి—బాబూ! ఈకాగితమును చిత్తగింపండి. దాని జూచినప్పటినుండియు నాకు తిండి లోనికిఁ బోవుట లేదు.

రఘు—(ఉత్తరముఁ జూచి) జయదేవు! ఈఉత్తరమును జూడుము.

జయ—(చూచి) సెట్టీ! నే నీరాత్రి నీ యింటికి వచ్చెదను. నీకేమియు భయము లేదు. ఇనుపపెట్టెఁ గూర్చి విచారింపఁదగదు. పొమ్ము.

సెట్టి (లోన) ఈ దొంగముండకొడుకెవఁడో? (రఘునాథరావుగారివైపుఁ జూచి చేతులు నులిమికొనుచు) చిత్తము. చిత్తము.

రఘు—సెట్టీ! నీకేమియు భయము లేదు. నేనైననేమి, నాకన్నివిధముల మిన్నయగు నా శిష్యుఁడైన నేమి? త్వరగఁ బొమ్ము.

సెట్టి తల వంచుకొని నిష్క్రమించెను. రఘునాథరావుగారు పని యున్నదని లోనికిఁ జనిరి. జయదేవు మాత్ర మాలోచనా నిమగ్నుఁడై కూరుచుండెను. అప్రయత్నముగ, Sherlock holmes అనియు, Maurice Leblanc అనియు, ఏవియో సందర్భశూన్యములగుమాటలాడుచుండెను. ఆఁకలి యెక్కువగుటచే జయదేవు కింక ఆలోచన సాగలేదు. త్వరగక్షుద్బాధా నివారణకై ప్రక్కనున్న అయ్యరు గారి 'ఆంధ్రహోము'లోనికిఁ బరువెత్తెను. ఆహా! అయ్యరుగారి కాంధ్రులపై నెంతయభిమానము!

3

సాయంకాల మాఱు గంట లాయెను. సూర్యుఁడు పశ్చిమాంభోనిధిని సమీపించుకొలఁదిని సెట్టిభయ మధికమగుచుండెను. ఆ దినమున సెట్టి చేయుచున్న రామభజనలకంతము లేదు. ఒక్కొక్కమారినుపపెట్టెనుగౌఁగిలించుకొని బారున నేడ్చుచున్నాఁడు; ఒక్కొక్కపరి సాష్టాంగ నమస్కారము లాచరించుచున్నాఁడు; ప్రదక్షిణములఁ జేయుచున్నాఁడు; పాటలఁ బాడుచున్నాఁడు; ఇంటిలోనివారలఁ జెడఁదిట్టుచున్నాఁడు.

ఏడుగంట లగుసరికి సెట్టి వీధితలుపు నెవరో తట్టిరి. సెట్టి పరుగునఁబోయి తలుపుఁ దీసెను. జయదేవు డిరువురు రక్షకభటులతో లోనఁ బ్రవేశించెను. వారిని జూచినతోడనే సెట్టి కన్నులయం దమృతము వర్షించెను. ఇనుపపెట్టెయున్నగదికి సెట్టి జయదేవుని తీసికొనిపోయెను. రక్షకభటులు వారి ననుసరించిరి. అంత సెట్టి,'ఈగ్రహములుకూడ నెందులకు బాబూ!మీరొక్కరు చాలరా? అల్లరియేకాని మరేమిగలదు. ఏమో! ఏ గడియ కెవరి కేబుద్ధిపుట్టునో ఇనుపపెట్టెను జూచినతోడనే, దురూహపొడమి, వారు మిమ్ములఁ జంపి పెట్టెనెత్తుకొనిపోవుదురేమో జాగ్రత్త!' అనెను.అంత జయదేవుమందహాసముతో సెట్టీ! సువాసిని వెనుక పూర్వసువాసిని ఎంతఅవసరమోడి టెక్టీవుక్కన్నుపెట్టరు వెనుక రక్షకభటులంత యావశ్యకము తెలిసెనా? వారులేనిదేకార్యమునెఱవేఱుటెట్లు? ఇంత యనుమానము కల్గినవాఁడవు సన్నేలసందేహింపవు? కాన నేఁబోయెదను' అనెను. అంత సెట్టి, 'బాబూ! క్షమించండి!రక్షించండి.బుద్ధిగడ్డితినది. డబ్బు మీఁది ప్రేమచే నోడలుతెలియక కారులాడితిని. రండోయి రక్షకభటులారా!' అనెను.

అంత జయదేవు 'ఏమోయీ! సెట్టీ! భోజనముచేసిరమ్ము. ఈజయదేవుఁ డుండఁగ నీకేమియు భయము లేదు. పోయి'రమ్మనెను.

రాత్రియెనిమిదిగంటలాయెను. సెట్టిజయదేవు లిట్లు మాటలాడుకొనుచుండిరి:

జయ—రాత్రి లోని కెవ్వరిని రానీయకూడదు సుమా!

సెట్టి—చిత్తము.

జయ—నీ తాళములిటు తెమ్ము.

సెట్టి—(భయముతో) తాళము లెందుకు?

జయ—తాళములునీదగ్గఅనుండతగదు.

సెట్టి—ఎందుచేత?

జయ—ఇచ్చెదవా లేదా? ఈయకున్న యెడల నేఁబోయెదను. నీకర్మము.

సెట్టి—బాబూ! అంతమాటే. కోమటి కుఱ్ఱవానిపై నంతఆగ్రహమే. ఇదిగో బాబూ తాళము చెవులగుత్తి. (ఇచ్చును).

జయ—మంచిది. నీవు పోయి నీగదిలోఁ బరుండుము.

సెట్టి—చిత్తము. బాబూ! ప్రొద్దుట మీకు మీసములు లేవుగదా ఇప్పు డెట్లు వచ్చినవి?

జయ—సెట్టీ! ఎంత తెలివితక్కువవాఁడవోయి నీవు! నిముసమున కొకవేసముతో నగపడుటయే అపరాధపరిశోధకుల ఘనత. అట్లుకానియెడల నపరాధులఁ బట్టుకొనుట మాతరమగునా?

సెట్టి—చిత్తము. సెలవుతీసికొనెదను.

అని తనగదిలోనికిఁ బోయెను.

రాత్రిపొమ్మిదిఘంటలకు సెట్టి వీధితలుపు నెవరో తట్టిరి. కాని తలుపుఁదీయునంతటి తెలివితేటలు కలవా రెవ్వరు?

* * * *

తెల్లవారెను. సెట్టి బట్ట సర్దుకొనుచు నినుపపెట్టె యున్నగదిలోనికిఁ బోయెను. ఆఁ. అదిఏమి!! సెట్టి నిలువెల్లవడఁకుచున్నాఁడే!!!

వెట్టిమొగముతోఁ జూచుచున్నాఁడే. ఇనుప పెట్టితలుపు తీసియున్నది. అందొక్కరూకయైనను లేదు. జయదేవుఁడును రక్షకభటులును గూడ కనఁబడలేదు. అంతసెట్టి, 'ఈఁడెటి క్లీవు ముండకొడుకు నాకొంపఁగూల్చినాఁడు. నన్ను నమ్మించి నాగొంతుకతడిగుడ్డతోఁ గోసినాఁడు. తాళము లెఱుఁగక ఆ దిక్కుమాలినవాని చేతిలోఁ బెట్టితినే. అయ్యల్లో! లోప లేమి చేయుచున్నారురోయి! నాధనము పోయినదిరోయి! కంచెయే చేసుమేసిన దిది యేమికర్మమురోయి! కానిమ్ము. ఈజయదేవు నా కగపడఁడా. అప్పుడు వానిపని పట్టించెదను. మొగముపై నిప్పులు పోసెదను!' అని అఱచుచుండెను. చేత నొకకాగిత మిడికొని త్వరగ, జయదేవుఁడు సెట్టియింటఁ బ్రవేశించెను. ఆతనికొడలుపై తెలియుటలేదు. అతఁడుకన్నుల నగ్నికణములఁ గ్రక్కుచు, 'సెట్టీ! బుద్ధిహీనుఁడా! రాత్రి తొమ్మిదిగంటలకుఁ దలుపుతట్టినఁ దీయక లోపలనేమేడ్చుచుంటివి. తగిన శాస్తి యైనది. నీబోఁటి తెలివితక్కువ నరుల కట్టులే కావలయును. లేనియెడల నోడల మద మణఁగదు. అనెను. ఆపలుకుల వినుటతోడనే సెట్టికి కోపము హెచ్చెను. ధనముపోయినదని యేడ్చుచుండఁగా తెలివితక్కువవాఁడవనెడు పల్కు చెవులఁబడఁగానే, 'ఆఁ ఏమనుచుంటివి. రాత్రి తొమ్మిదిగంటలకు వచ్చితివా. ఎనిమిది గంటలకు ఇరువుర రక్షకభటులతో రొయ్యమీసములవేషముతో సిద్ధపడిన చానరయ్య యెవఁడు? నిముసమున కొక వేసము వేయుదునని పల్కిన డాబులరాయఁ డెవఁడు? నీవేగా? మర్యాదాహీనుఁడా, మాటలుతిన్నఁగరానిమ్ము; మాఅయ్య మంచివాఁడుకాఁడు'. అని వ్యాజ్యము గెల్చుట కాధారములేక వాగ్ధాటిచే విజయముఁ గాంచఁదలఁచిన న్యాయవాదివలెనఱచెను. 'సెట్టీ! శాంతినొందుము. ఈఉత్తరముఁ జూచుకొను'మని జయదేవుఁ డొకకాగిత మాతని మొగమునఁ బాఱవైచెను. సెట్టి ఆయుత్తరము నీరీతిగాఁ జదువుకొనెను.

అపరాధి పరిశోధకాగ్రగణ్యులగు జయదేవు గారికి—

అయ్యా! నమస్కారములు.

నేను నిన్నసాయంకాలము మీవేషము వేసికొని సెట్టియింటఁ బ్రవేశించి, ఆతఁడు నాకిచ్చిన తాళములతో నాతని ఇనుపపెట్టెలోని వస్తువులన్నియు గ్రహించితిని. సెట్టి మిగుల విచారించుచుండును. ఆతని నేడ్పించుటకిష్టము లేదుకాన ఆపురాత్రి మీరుభయులు రాజమహేంద్రవరములో ఇన్నీసుపేటలోని 960 నంబరు గృహమునకు వచ్చిన తిరిగిఇచ్చివేయుదును. మీప్రాణములకేమియు భయము లేదని నొక్కిచెప్పుచున్నాను.

ఇట్లు,
ఆపు తమరాకకై వేచియుండు
భవదీయమిత్రుఁడు
"గజదొంగ."

'సెట్టీ! లెమ్ము; రాజమహేంద్రవరము పోవుదము.

౪

ఆనాఁటిసాయంకాలము నాల్గుగంటలకు కాకినాడ ఫ్లాట్‌ఫారముమీఁద జయ

దేవుఁడును, వెంకటసెట్టియు కూర్చుండియుండిరి. బండివచ్చువేళ యైనది. జయదేవు వెంకటసెట్టి చేతికిఁ గొంతసొమ్మిచ్చి రెండుటిక్కట్లు తీసికొనిరమ్మనెను. సెట్టి బుక్కింగుఆఫీసులోనికిఁ బోయి రెండుఇంటరుమీఁదియేటు టిక్కట్లు రాజమహేంద్రవరమునకుఁ గొని పైకిఁ బోయెను. ఇంతవఱకు చుట్టగాల్చుకొనుచు కునికిపాట్లుపడుచున్న అసిస్టాంటుస్టేషనుమాస్టరు 'Damn Dirty Devil Probationers!' లోనుండి టిక్కెట్లు నీయవలదని మీకెన్నిసారులు చెప్పితిని? చేసెడు పిఠవపనులన్నియు మీరు, వచ్చెడు చీవాట్లు మాకు' అనివిసుగుకొనెను.

రైలు ప్లాటుఫారముమీఁదికి వచ్చెను. జయదేవు, సెట్టియు బండినెక్కిరి. 'ఎందులకు వచ్చెనురా భగవంతుఁడా'యని బండి యేడ్చుచు సామర్లకోటఁ జేరెను. మనకథానాయకులిరువురును బండిదిగి, అచ్చట కప్పుడే వచ్చిన మెయిలుబండినెక్కిరి.

రాత్రి యేడుగంట లగుసరికి రాజమహేంద్రవరముఁ జేరిరి. హోటలులో భోజనముఁ జేసి ఇన్నీసుపేటలో పెద్దయంకెలతో 960 అని యున్నగృహమునఁ బ్రవేశించిరి. ఇరువురు. సేవకులు వారి నెదుర్కొని మేడమీఁదికిఁ దీసికొనిపోయిరి. వారిరువురు కుర్చీలపై ఆసీనులైరి. సెట్టి నిల్వుగుడ్లు పైచుకొని ఇటునటు చూచుచుండెను. సేవకులలోనొకఁడు సెట్టిగొంతుకనొక్కెను. 'బే'యని సెట్టి చెవి గోసిన మేకవలె అఱచుచు గిలగిలకొట్టుకొనుచుండెను. అంత జయదేవుఁ డిదియే సమయమనుకొని, 'మిమ్ములనందఱ నిదే చంపుచుంటి' నని రివాల్వరు కొఱకయి జేబులోఁ జేయిపెట్టెను. వెనుకనున్న రెండవసేవకుఁడు జయదేవుచేయిఁ బట్టుకొని, 'జయదేవ్' అని పిలిచెను.

అంతజయదేవు నిశ్చేష్టుఁడై 'రఘునాథజీ' అని పిలిచెను. అంత రఘునాథరావు, 'జయదేవ్! గజదొంగను నేనేసుమీ'అనెను. 'అటులైన మీ చేతి కరదండములఁ దగిల్చెద' ననెను. 'నాయనా! ఇదిగో నీ చేతి కరదండముల దగుల్చుచుంటి'నని జయదేవుని కరదండములు వైచెను; రఘునాథరావు '961నెంబరుకల గృహములో నీ వకారణముగ అల్లరి చేయుచుంటివి గాన నీకీశిక్ష విధించితి' ననెను. అంత జయదేవు,'ఆఁ' ఇది 910 వ నంబరుగల యిల్లు కాదా' అనెను. 'కాదు నీ గర్వభంగమునకై ఈయింటిపైనున్న నంబరు తుడిచి వైచి 960 నంబరు వైచితిని, చూడుము. నిజముగ ఇది 961 వ నంబరు గృహమే' అని ఇంటినంబరు చూపెను. 'నీవు చిన్నవాఁడవు. అపరాధపరిశోధనయం దారితేరని వాఁడవు. అట్టి నీకు తలకు మించిన పలుకులు తగవు' అని రఘునాథరావుగారనిరి.

'అయ్యా! క్షమింపవలయు'నని జయదేవు రఘునాథుని కాళ్లపైఁ బడెను. 'ఇది నీ ఒక టిన్నర తెలివితక్కువ'యని సెట్టి తన తెలివితక్కువను వడ్డీతో జయదేవునికప్పఁజెప్పెను.